

# ఆశ

రోజు కంటే ఆవేళ ముందుగా లేచింది శారద. అసలు ఆ రాత్రి ఆమెకు నిద్రపడితేనా? లేస్తూనే కూనిరాగాలు తీస్తూ పనిపాటల్లో పడింది.

రస్న పొడరు నీళ్ళలో కలిపి డ్రింక్ తయారుచేసి ఫ్రిజ్‌లో పెట్టింది. హాలంతా శుభ్రం చేసి సోఫాలు సర్దింది. ఫ్లవర్ వాజ్‌లో పూలు మార్చింది. ఫిల్టరు తీసి కాఫీ కలిపింది. బద్ధకిస్తున్న భర్తను బలవంతంగా లేపి బాత్‌రూమ్‌లోకి నెట్టింది. ఆరోజు ఆమె మనసుఎంతో ఉల్లాసంగా వుంది. ఆవేళ జనవరి ఫస్ట్ న్యూఇయర్స్‌డే. మగడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఎంతోమంది వస్తారు. ఎన్నెన్నో కానుకలు తెస్తారు. అదన్నమాట ఆమె సంబరానికంతటికీ కారణం. ఉన్నట్లుండి గత నూతన సంవత్సర వైభవం కళ్ళముందు మెదిలింది.

శారద భర్త శంకర్రావుకి పబ్లిక్ రిలేషన్ ఆఫీసరుగా ప్రమోషనొచ్చింది. సహజంగా మనిషి మంచి వాడు కావడం వల్ల ఆ సంవత్సరం అతడికి న్యూఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎంతోమంది వచ్చారు. వచ్చినవాళ్ళు ఉత్తచేతుల్తో రారుకదా! ఎవరికి తోచిన కానుక వారు పట్టుకొచ్చారు. నాడు శ్రీనివాసుడి కళ్యాణానికి కుబేరుడు కురిపించిన కాసుల్ని కొలిచేసరికి శోష వచ్చి పడిపోయాడట గోవిందరాజులు. మరినేడు అసంఖ్యాకంగా భర్తకొచ్చిపడ్డ గిఫ్ట్ ప్యాకెట్లు విప్పేసరికి శారద బొంగరపుకీలు అరిగిపోయింది. డైనింగ్ సెట్టు, వాటర్ ఫిల్టర్ , కుక్కరు, మిక్సీ, మినీగ్రైండరు, కెమేరా, ఆల్బం, పెన్‌సెట్... ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రెజెంటేషన్లు కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. వాటినన్నింటిని ఏం చేసుకోవాలో తెలీక కొన్నింటిని అమ్మేసిసొమ్ము చేసుకుంది. వచ్చిన డబ్బుతో

హారం చేయించుకుంది. పోయిన ఏడు కంటే ఈ ఏడు రెట్టింపు బహుమతులు రావచ్చు. అంతే, రవ్వలనెక్లెస్ ఆమె కళ్ళముందు మెరిసింది.

ఏడు... ఎనిమిది...తొమ్మిది...పది... ఆమె మనోవేగాన్ని మించిపోయింది కాలవేగం. ఎందుకో శంకర్రావుకి గ్రీటింగ్స్ చెప్పేందుకు ఆవేళ ఒక్కరంటే ఒక్కరు రాలేదు. గంటలు గడుస్తున్న కొద్దీ ఆమె ఉత్సాహం నీరుగారిపోతోంది ఎంత తమాయించుకుంటున్నా దఃఖం ఆగడంలేదు ఇంకా ఏదో ఆశ. ఆలస్యంగానైనా అభిమానులు రాకపోతారా అన్న ఆరాటం.

ఈ నిరీక్షణలో పదకొండు దాటింది. ఉదయం పడ్డ ఉడుకునీళ్ళు తప్ప ఇంకేం లేకపోవడంతో శంకర్రావు కడుపులో ఎలకలు పరిగెడుతూన్నాయి.

"ఇవాళ వంట చేసే యోచనేమైనా వుందా లేదా?" అని అడిగేసాడు మరి ఉండలేక.

"వంటకేం భాగ్యం. అరగంటలో చేసి పెడతాను. అప్పుడే ఆకలేస్తోందా ఏవిటి? ఔనూ! ఇవాళ మీకు గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎవరూ రాలేదేమిటండి" అనుమానం నివృత్తి చేసుకునేందుకు అడిగేసింది శారద. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళు చెమ్మగిల్లడం గమనించకపో లేదు శంకర్రావు.

"పిచ్చిదానా! నిన్న డిసెంబరు ముప్పై ఒకటిన రిటైరయిపోయాను కదే. పదవీ విరమణ చేసిన అధికారితో ఇంకేం పనిఉంటుంది? పొద్దున్నుంచి నువ్వు తెగ హైరానా పడిపోతూంటే ఎందుకో అనుకున్నాను. ఇందుకన్నమాట!" అన్నాడు నవ్వుతూ.

"అదేవిటండి నిన్న సాయంత్రమే కదా మీరు రిటైరయ్యారు. ఇంతవరకు మీవల్ల లబ్దిపొందిన వాళ్ళంతా అప్పుడే మరచిపోతారా? ఆశ్చర్యంగా వుందే..."

"వాళ్ళు నన్ను మరచిపోవడం ఆశ్చర్యం కాదు. నువ్వు అతిగా ఆశించడమే విడ్డూరంగా వుంది, లే లేచి భోజనం సంగతి చూడు" ఓదార్పుగా అన్నాడు శంకర్రావు.

**( 6.3.2003 ఆంధ్రభూమి వీక్లీ )**